# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
# జీవన సంహిత
# గేయకృతి

రచన

డా॥ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

# MATRUSRI TARIGONDA VENGAMAMBA JEEVANA SAMHITA GEYAKRITI

*Written by*
**Dr. V.B. Sai Krishna Yachendra**

T.T.D. Religious Publications Series No. 841
© All Rights Reserved

*First  Edition :* 2010
*Re-print :* 2019

*Copies :* 1000

*Published by*
**Sri Anil Kumar Singhal,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati  Devasthanams,
Tirupati - 517 507

***D.T.P:***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507





# ముందుమాట

అసంఖ్యాకమైన గేయధారల అవధానాలచే "సంగీత సాహిత్య పరిపుష్టులు"గా ఆంధ్రదేశంలో ప్రసిద్ధి గడించిన సహృదయ కవిశేఖరులు డా॥ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర గారు.

వీరు వేంకటేశ్వరుని ఆంతరంగిక భక్తశిరోమణి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవితగాథను చక్కని గేయకావ్యంగా రచించటం అభినందనీయం.

భారతీయ సంప్రదాయానుసారం బ్రహ్మవిద్యలు ముప్పది రెండుగా పరిగణింపబడినాయి. డా॥ యాచేంద్రగారు పరమయోగినీ, బ్రహ్మవాదినీ అయిన వెంగమాంబగారి పవిత్ర జీవితంలోని ముఖ్యాంశాలను అదే సంఖ్యలో అనగా, ముచ్చటగా ముప్పది రెండు గేయాల్లో – పొందికగా ఇమిడించి రచించివుండటం సముచితంగానూ, ప్రశంసనీయంగానూ, అలరారుతూ వుంది.

ఈ భక్తకవయిత్రి జీవితగాథను సుందరంగా, శ్రావ్యంగా రచించటంలో శ్రీ యాచేంద్ర కవిగారు కృతకృత్యులయ్యా రనటానికి ఇందలి ప్రతిగేయమూ 'అక్షరసాక్షి'.

వెంగమాంబ పవిత్ర జీవితాన్ని సుమధురశైలిలో వెల్లడిస్తూవున్న ఈ గేయకావ్యం తి.తి.దే. తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు పక్షాన వెలువరించటం ముదావహం.

ఆర్ష సంస్కృతికి పట్టు గొమ్మలుగా ప్రశస్తిగాంచిన వెంకటగిరి సంస్థానాధీశుల కోవలోనివారయిన డా॥ సాయికృష్ణ యాచేంద్రగారు ఈ గేయకృతిని రచించటం బంగారుకు తావి అబ్బినట్లయింది!

వెంగమాంబ జీవిత విశిష్టతను సొంపుగా ప్రబోధిస్తూ వున్న ఈ మనోజ్ఞ కావ్యం ఆంధ్రావళికి ఆనందదాయకం కాగలదని మా ఆశయము, ఆకాంక్ష!

*సదా శ్రీవారి సేవలో...*

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# అభినందన

**డా॥ మేడసాని మోహన్** తేది : 22-02-2010

సంచాలకులు
అన్నమాచార్య ప్రాజెక్ట్
తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్ట్
తి.తి.దేవస్థానములు
తిరుపతి.

కలియుగ ప్రత్యక్షదైవతమూ, నిత్యకల్యాణ చక్రవర్తీ అయిన శ్రీనివాసుణ్ణి కృతికుసుమాలతో ఆరాధించి తరించిన సాహితీమూర్తులలో తాళ్ళపాక అన్నమాచార్యులతోపాటు ఎన్నదగిన ఆధ్యాత్మిక కవయిత్రీ శిరోమణి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ.

ఆ మహాత్మురాలి పవిత్ర జీవిత గాథను మనోజ్ఞమైన గేయకావ్యంగా రచించిన డా॥ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర గారు బహుధా ప్రశంసనీయులు.

సాహితీ సంగీత గేయధారలచే యావదాంధ్రులకు సుపరిచితులయిన సుగృహీత నామధేయులు డా॥ యాచేంద్ర గారు. వీరు ఇతఃపూర్వం తి.తి.దేవస్థానం కోరిక మేరకు ఈ భక్త కవయిత్రి జీవిత చరిత్ర ఆధారంగా "తరిగొండ వెంగమాంబ జీవన గానం" అనే రూపకాన్ని రచించి ఆడియో సి.డి.గా నిర్మింపజేశారు. తద్వారా తరిగొండ వెంగమాంబ జీవన గాథ ఆంధ్రావనిలో అద్వితీయమైన ప్రచారాన్ని పొందింది.

"మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవన సంహిత" అనే ఈ గేయకృతి సైతం అచిరకాలంలోనే ధ్వనిముద్రణ భాగ్యాన్ని పడసి, ఆంధ్రావళి ఆబాలగోపాలాన్ని అలరింపజేయగలదని ఆశిస్తున్నాను.

సిద్ధహస్తులయిన శ్రీ యాచేంద్ర కవీంద్రులను ఈ కృతిరత్నాన్ని రచించినందుకు మఱోమాఱు హృదయపూర్వకంగా అభినందిస్తూ వున్నాను.

**– డా॥ మేడసాని మోహన్**

# అభినందన చందనం

**"భూమన్"** తేది : 25-12-2009

సంచాలకులు
"శ్వేత"
తి.తి.దేవస్థానములు
తిరుపతి.

తరిగొండ వెంగమాంబ తెలుగు వాఙ్మయ ప్రపంచంలో విశిష్టమయిన సాహితీమూర్తి. "మరుగున పడిన మాణిక్యాలు రాయలసీమ రత్నాలు" - అనే సూక్తికి ఆమె ప్రథమ ఉదాహరణం. వెనుకటి వాఙ్మయ చరిత్రకారులు సైతం - తెలిసో, తెలియకో - ఆ మహాకవయిత్రి గొప్పతనాన్ని అంతగా గుర్తింపలేకపోయారు. అయితే, అది ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడు వెంగమాంబనుగూర్చి, ఆమె సాహిత్య విస్తృతిని గూర్చి ఆంధ్ర దేశంలో తెలియని వారు లేరు. ఇందుకు ముఖ్య కారణం తి.తి.దేవస్థానములు ఈ భక్తకవయిత్రి పేరట ఒక వాఙ్మయ ప్రాజెక్టును నెలకొల్పటం.

తి.తి.దే. "శ్వేత" భవనంలో మూడేళ్లక్రితం స్థాపింపబడిన ఈ వాఙ్మయ ప్రాజెక్టు అరుదైపోయినటువంటి, అముద్రితంగా ఉన్నటువంటి ఈ ప్రజాకవయిత్రి రచనలను పరిష్కరించి ప్రచురించటము, పాటల ఆడియో సి.డి.లను వెలువరించటము, ఆ యా పట్టణాలలో సాహిత్య సదస్సులను, సాంస్కృతిక కార్యక్రమాలను, జయంతులను, వర్ధంతులను వైభవోపేతంగా నిర్వహించడము - ఇత్యాదుల ద్వారా వెంగమాంబ సారస్వత ప్రశస్తి విశ్వవ్యాప్తంగా విస్తరించింది!

తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారుల ప్రోత్సాహంతో "శ్వేత" సంస్థలో మూడు పూవు లారు కాయలుగా విలసిల్లుతూవున్న ఈ

వాఙ్మయ ప్రాజెక్టు కార్యకలాపాలలో ఆదినుండీ ప్రముఖంగా పాల్గొంటూవున్న శ్రీ యాచేంద్రగారిని ఈ సందర్భంలో హృదయపూర్వకంగా అభినందిస్తూ వున్నాను.

వేంకటగిరి సంస్థాన అధిపతుల ఉదాత్తతా, సౌజన్యమూ – ఉత్తమంగా పుణికిపుచ్చుకొన్న డా॥ యాచేంద్రగారి లేఖిని నుండి ఇటీవల వెలువడిన సుందర కృతి ఈ "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవన సంహిత" గేయకృతి.

సహజ కవయిత్రి అయిన తరిగొండ వెంగమాంబ జీవితగాథను ఆణిముత్యాల్లాంటి ముప్పైరెండు గేయాల్లో ముచ్చటగా, ముక్త సరిగా ఇందులో అక్షరబద్ధం కావించిన శ్రీ యాచేంద్ర గారి కవితా కౌశలం ప్రశంసాపాత్ర మయింది!

ఈ కమనీయ కావ్యం త్వరలో సుప్రసిద్ధ గాయనీ గాయకుల సహకారంతో ధ్వనిముద్రితమై, ఆడియో సి.డి.ల రూపేణ ప్రకటింపబడి, ఆంధ్రావనిని అలరింపగలదని ఆశిస్తూవున్నాను.

**"భూమన్"**

# సుహృదభినందనలు

**జ్ఞానపీఠ అవార్డు గ్రహీత**
**డా॥ సి.నారాయణ రెడ్డి, ఎక్స్ ఎం.పి.**
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.,

తేది : 25-12-2010

డా॥ సాయికృష్ణ యాచేంద్ర కవితాత్మకతను తనలో మూర్తీభవించుకున్న గణనీయ వ్యక్తి. అతడు కలమెత్తితే గేయనిధులు మన కళ్ళముందు నిలుస్తాయి. గళమెత్తితే రాగధునులు స్వర తరంగితంగా పరవళ్ళు తొక్కుతాయి. 'సంగీత గేయధార' అతడు సాహిత్యరంగంలో చేసిన విలక్షణ వినూత్నప్రయోగం. అవధాన సదృశంగా రూపొందిన ఈ ప్రక్రియ ద్వారా తెలుగునాట అతని కీర్తి పతాకసదృశంగా నిలిచింది.

ఈ గ్రంథంలో 'తరిగొండ వెంగమాంబ' జీవితాన్ని వివిధ గేయ గతుల్లో పఠన, గానరమ్యంగా రూపొందించారు డా॥ సాయికృష్ణ. ఆ భక్త కవయిత్రి జీవితాన్ని, ఆమె రచనా రామణీయకాన్ని ఆద్యంతాలు పాఠకులకు పారవశ్యం కలిగించేటట్టుగా రచించిన ఈ గ్రంథంలోని ఎత్తుగడ ఇది :

**"వెంగమాంబ కథ వింటే**
**పొంగిపోవు మనసు...**
**ఆ భక్తురాలి హృదయము**
**భగవానునికే తెలుసు".**

ఈ నాలుగు పంక్తుల్లో డా॥ సాయికృష్ణ యాచేంద్ర వెంగమాంబ వ్యక్తిత్వాన్ని పొదిగిచూపారు. మరో రెండు పంక్తుల్లో ఆమె ఆ వేంకటేశ్వరునిపై ఎలా ప్రగాఢానురక్తిని పెంపొందించుకుందో డా॥ యాచేంద్ర ఇలా చెప్పారు:

**"పుట్టుకతోనే పురుడు పోసుకునె**
**పురుషోత్తమునికై అనురక్తి".**

దాని పర్యవసానం ఆ వేంకటపతి గురించి ఆమె చేసిన కవితాగానం ఎప్పుడు? పుట్టకముందే. ఈ పంక్తులు దాన్ని సూచిస్తున్నాయి :

ఇలా –

**"కడుపులోన ఉన్నపుడే**
**కావ్యపానము చేసినదా?**
**అమ్మ ఒడిలో ఒదిగినపుడే**
**బ్రహ్మజ్ఞానము పడసినదా?"**

వెరసి –

**"వెంగమాంబ జీవితం**
**వేంకటేశాంకితం".**

ఆమె బాల్య చేష్టల్లో కూడా ఆ ఏడుకొండల వాని సమారాధనమే.

**"బడికి పొమ్మంటే**
**గుడికి వెళ్తుంది**
**ఆడుకొమ్మంటే**
**పాడుకుంటుంది".**

అత్యంత కవితాత్మక పంకులెన్నో ఈ గేయకావ్యంలో అగుపిస్తాయి.

ఉదాహరణకు –

**"తరిగొండ నికేతనుడు తరుణికి ఇలవేల్పు**
**గరుడాద్రి నివాసుడు కలికి ఎడదతాల్పు"**

ఈ పంక్తుల్లోని "ఎడదతాల్పు" పరమ నవ్య ప్రయోగం. ఈ రకంగా ఉదాహరించుకుంటూ పోతే భక్తిభరిత కవితానిహిత పంక్తు లెన్నెన్నో ఎదలు సాచి సాక్షాత్కరిస్తాయి.

మాత్రాచ్ఛందస్సులోని చతురశ్ర, త్రిశ్ర, ఖండాది గతుల్లో గానరమ్యంగా రూపొందిన ఈ కృతిని రచియించిన డా॥ సాయికృష్ణ యాచేంద్ర గేయ సాహితీ జగత్తులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నాడు. అందుకు నా ఆత్మీయతా స్నిగ్ధమైన శుభాభినందనలు.

# అభిప్రాయము

**ఆచార్య కె.జె.కృష్ణమూర్తి** తేది : 22-03-2010
తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్ట్
తి.తి.దే. తాళ్ళపాక అన్నమాచార్య వాఙ్మయ పీఠం
అన్నమాచార్య కళామందిరం, తిరుపతి.

'కవితా తపస్విని', 'సకల తత్త్వార్థ వివేకిని' మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవిత గాథ పరమ రమణీయమైనది, మహత్త్వ పూర్ణమైనది. అందలి అంతస్సూత్రం తరిగొండ లక్ష్మీనృసింహుని సన్నిధిలో నుండి కొనసాగి, తిరుమల వేంకటరమణుని పాద సన్నిధిలో పర్యవసించి, "నిత్య ముత్యాల హారతి" గా ప్రకాశించి చరితార్థత నొందింది.

సహజ కవయిత్రీ, ప్రజా కవయిత్రీ - అయిన వెంగమాంబ జీవిత కథ ఆధారంగా ఇంతవరకు తెలుగులో నవల, నాటకం, హరికథ, బుఱ్ఱకథ-ఇత్యాది ప్రక్రియలలో రచనలు వెలువడివున్నాయి.

వీటన్నింటికి తలమానికంగా అవతరించిన గేయకృతి "మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవన సంహిత" సరస సంగీతావధానిగా, సుమధుర వాగ్గేయకారుడుగా విశ్వవిఖ్యాతి గాంచిన డా॥ వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర గారు ఈ కావ్య రచయిత.

ఈ కావ్యంలో వీరు వెంగమాంబ పవిత్ర జీవితానికి సంబంధించిన ముఖ్యాంశాలను అన్నిటినీ ఇమిడించి, ముచ్చటగా ముప్పదిరెండు గేయాల్లో ఆహ్లాదకరంగా రచించారు. ఇందలి గేయాల శైలి ఆ యా సన్నివేశాలకు, భావాలకు అనుగుణమైన రీతిలో గంగాస్రవంతిలాగా అనర్గళంగా జాల్వారింది.

వస్తు నిర్దేశకమైన మొదటిగేయంలోనే ఈ రచయిత వెంగమాంబ విశిష్ట వ్యక్తిత్వాన్ని చిత్రీకరించిన తీరు తిలకింపదగివుంది :

**"తరుణీలోకమున కామె – తలబంతి**
**విప్లవ భావాలతో – వెలిగే జ్యోతి**
**మగువ గౌరవము నిలిపిన – మహాశక్తి; ఆపద**
**మ్రొక్కుల వానికి పట్టిన – ముత్యాల హారతి".**

అల్పాక్షరాల్లో అనల్పమైన అర్థరచనకు పై చరణం ఒక మచ్చు తునక!

ఇలాగే, ఈ ప్రజాకవయిత్రి సామాజిక దృక్పథాన్ని చాటుతూవున్న ఈ క్రింది పంక్తులు ప్రముఖంగా పరికింప దగివున్నాయి :

**"నారీజనాభ్యుదయమునకు**
**నాందీ గీతం వెంగమాంబ**
**సాంఘిక దురాచార సంస్కర్తగ**
**సంభవించెను వెంగమాంబ**
**ప్రశ్నించే అధికారం – ప్రతి యొకరి జన్మహక్కు**
**ఆధునిక భావ పరంపర కిదే – ఆది బుక్కు".**

పరమయోగిని యైన వెంగమాంబకు అక్షరాల రూపంలో శారదాదేవి సాక్షాత్కరించిన సన్నివేశం నిజంగా అపూర్వం! ఆ సన్నివేశాన్ని అద్వితీయంగా ఆవిష్కరించిన "నభోవీథిలో వర్ణమాలికలు" – అనే పన్నెండవ గేయం ఈ కవి రచనాశక్తికి అక్షర నిదర్శనం!

**"మహిత తత్త్వమార్గములో – మనుగడ సాగించే**
**జీవులకు భక్తియే – త్రోవ చూపు జ్యోతి" –**

అనే ఉత్తమ సందేశాన్ని ప్రబోధిస్తూవున్న ఈ గేయకావ్యం "అక్షర శారద" యైన తరిగొండ వెంగమాంబ దివ్య జీవనగాథకు నిత్య నీరాజనంగా విలసిల్లుతూ ఉండగలదు.

'దైవం సత్య' మనే ఆదర్శంతో పరహితాచరణమే పరమ పురుషార్థంగా భారతీయ సంస్కృతిని పరిపోషిస్తూవున్న వేంకటగిరి సంస్థానాధీశుల వంశీయులయిన డా॥ యాచేంద్ర గారు ఈ కమనీయ కావ్యాన్ని ప్రత్యక్ష దైవాలైన తమ జననీ జనకులకు భక్తితో సమర్పించటం బంగారుకు తావి అబ్బినట్లయింది!

**"వెంగమాంబ జీవితం - వేంకటే శాంకితం-ఆ**
**భక్త శిఖామణి చరితం - పరమ పునీతం".**

**- కె.జె. కృష్ణమూర్తి**

# హృదయస్పందన

**డా॥ వి.బి. సాయికృష్ణ యాచేంద్ర** సంస్థానం
యం.ఎ., పిహెచ్.డి., వెంకటగిరి

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సుప్రసిద్ధ భక్త కవయిత్రి. సారస్వతారాధకులు సంస్తుతించిన జనయిత్రి. ఆమె దివ్యకథ ఆధ్యాత్మిక సుధ. ఆమె పుట్టుకచే ధన్యత గాంచినది ఈ వసుధ. భక్తికున్న అపారశక్తిని చాటిన భాగవతోత్తమురాలు ఆ నారి. సాంఘిక దురాచారాలపై మ్రోయించిన సమరభేరి. భగవదారాధన తనను తానుద్ధరించుకొనడానికే కాదు, అందరిని తరియింపజేయడానికనేది ఈమె భావన. మూఢాచారాల నుండి విముక్తి పొందాలని ఈమె వాదన. శ్రీ నరసింహుని తిరుమలేశుని అభేద మూర్తులుగ దర్శించిన తాత్త్వికజ్యోతి. ఆమె జీవితం వేంకటేశునికి పట్టిన కర్పూర హారతి.

ఈమె దివ్యజీవితం 'హరికొలువు' అనే గ్రంథంలో చదివి స్ఫూర్తి పొంది తిరుమల తిరుపతి దేవస్థానాల వారి సౌజన్యంతో 2006 సం॥లో 'జీవనరాగం' అనే శ్రవ్యరూపకంగా రూపొందించాను. ఆ తరువాత వెంగమాంబ ప్రాజెక్టు సమర్పణలో శ్రీ భూమన్‌గారి సారథ్యంలో ఆమె రచనలను స్వరపరచి సి.డి.లుగా సమర్పించాను.

ఈ సంగీత యాత్రలో ఎందరో విద్వన్మణులు, గాయనీ గాయకులు, వాద్యనిపుణులు సహకరించారు. వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతాంజలులు.

మాతృశ్రీ వెంగమాంబ జీవనకథనం అనేక రూపాలు సంతరించుకొని నాటకంగా, నృత్యరూపకంగా, హరికథగా, స్వరసుధగా బహుముఖీనంగా పరివ్యాప్తమైంది.

ఆ దివ్యయోగిని గాథను గేయరూపంగా పఠనగానయోగ్యంగా అందించాలనే ప్రయత్నానికి అక్షరాకృతియే ఈ గేయకృతి. ఆమె ఆంతర్యం దృష్టిలోనుంచికొని ముప్పది రెండు గీతాలుగా ఆమె మహిమాన్విత చరిత్రను రూపొందించడం జరిగింది. ఈ సంఖ్యకెంతో ప్రాధాన్యమున్నది. ఆమె ఉపాస్యదైవతమైన శ్రీనారసింహుని మహామంత్రములో ముప్పది రెండక్షరములే! యోగసాధనతో ఆమె అద్వైతాత్మావలోకన పొందడానికి ఉపకరించినవి "ద్వాత్రింశత్ బ్రహ్మవిద్యలే". ఈ విషయం మనసులో నుంచుకొని ఈ గేయకృతి రచించడం జరిగింది. సందర్భానుగుణమైన మాత్రాచ్ఛందో భేదాలతో గీత సృజన చేయడమైంది.

ఈ రచనకు ప్రేరణ, ఉద్దీపన వెంగమాంబయే. నేను కేవలం నిమిత్తమాత్రుడి ననడం ప్రత్యక్షర సత్యం. ఈ మహత్తర కార్యానికి దోహదపడి ముద్రణరూపం కల్పించిన తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి అధ్యక్షులు శ్రీ ఆదికేశవులునాయుడు గారికి, కార్యనిర్వహణాధికారి శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు గారికి, మరియు అధికార వర్గానికి, ప్రస్తుత ప్రాజెక్టు సంచాలకులు డా॥ మేడసాని మోహన్ గారికి, ప్రాజెక్టు పూర్వ సంచాలకులు శ్రీ భూమన్ గారికి ధన్యవాదాలు. మున్నుడి అందించిన ఆత్మీయగురువర్యులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి.నారాయణ రెడ్డి గారికి, ఆప్యాయంగా అభిప్రాయం వెలువరించిన ఆచార్య కె.జె.కృష్ణమూర్తి గారికి మనస్సుమనస్సులు.

ఈ రచన సహృదయైకవేద్యం. సప్తాచలేశునికి నైవేద్యం. నాలో ఆధ్యాత్మిక బీజాలు నాటి, సంగీత సాహిత్య రుచులు చవిచూసిన నా జన్మకారకులు జననీ జనకులు శ్రీమతి శారదాదేవిగారికి, వెలుగోటి వెంకటశేష వరద రాజగోపాల కృష్ణయాచేంద్ర వారికి ప్రేమోపహారంగా ఈ కృతి – సమర్పితం.

**– వెలుగోటి భాస్కర సాయికృష్ణ యాచేంద్ర**

# గేయానుక్రమణిక


| | పుటలు |
|---|---|
| 1. వెంగమాంబ కథ వింటే | 1 |
| 2. వేంకటగిరిపతి పైన | 2 |
| 3. ఏల? ఆ బాల | 3 |
| 4. వెంగమాంబ జీవితం | 4 |
| 5. వేంకటాచలాధిపతి | 5 |
| 6. కన్నెప్రాయము రాకమునుపే | 6 |
| 7. విధి విలాసములు | 7 |
| 8. నారీ జనాభ్యుదయమునకు | 8 |
| 9. ఎవరేమన్నా | 9 |
| 10. అందెలు ఘల్లన – ఆడినది | 10 |
| 11. ఎదురీదే ప్రతివారికి | 11 |
| 12. అక్షర సాక్షాత్కారం | 12 |
| 13. గురూపదేశముతో | 13 |
| 14. గొప్ప వారికెపుడైనా | 14 |
| 15. తరిగొండ నికేతనుడు | 16 |
| 16. పాడులోకము | 17 |
| 17. అగుపించే నదివో | 18 |

| | |
|---|---|
| 18. వేంకటేశుని – వివశతతోడ | 19 |
| 19. తులసీదళముల | 20 |
| 20. పవలురేయి పరమాత్ముని | 21 |
| 21. ఏడుకొండల పైన | 22 |
| 22. అతడే చెంతకు | 24 |
| 23. మనసర్పించిన | 25 |
| 24. ఎంతటి కరుణ | 26 |
| 25. పగలంత స్వామికి | 27 |
| 26. ఏకాంతమే కదా | 28 |
| 27. ఏ అలజడి లేదు | 29 |
| 28. వెంగమాంబ జాడ నెరుగరు | 30 |
| 29. తిరిగివచ్చె వెంగమాంబ | 31 |
| 30. ముముక్షుజనులకు | 32 |
| 31. ఈ జన్మ కిది చాలదా! | 33 |
| 32. శ్రీ పన్నగాద్రివర శిఖరాగ్రవాసునకు | 35 |


* * *

## వెంగమాంబ కథ వింటే

వెంగమాంబ కథ వింటే
        పొంగిపోవు మనసు ఆ
భక్తురాలి హృదయము
        భగవానునికే తెలుసు.

తిరుమలాధీశుని - వరఫలితముగా,
కానాల కృష్ణయ్య - కలల పంటగా,
మంగమాంబ గర్భములో - మాణిక్యముగా,
తరిగొండను జనియించిన - నరసింహోపాసిని.

పరమభక్తి - ముక్తి సోపానమని,
ప్రణవాక్షరాధ్యయనము - ప్రాణమని,
జ్ఞానయోగ సార మమృత పానమని,
తత్త్వసిద్ధిని పొందిన - తపస్విని.

తరుణీలోకమున కామె - తలబంతి
విప్లవ భావాలతో - వెలిగే జ్యోతి
మగువగౌరవము నిలిపిన - మహాశక్తి ఆపద
మ్రొక్కులవానికి పట్టిన - ముత్యాలహారతి

వెంగమాంబ కథ వింటే - ఉప్పొంగిపోవు మనసు

## వేంకటగిరిపతి పైన

వేంకటగిరిపతి పైన
వెంగమాంబకు భక్తి
పుట్టుకతోనే పురుడుపోసుకొనె
పురుషోత్తమునిపై అనురక్తి.

ఊహ తెలియని నాడే
ఉన్మేషించె స్మరణాసక్తి
ఊపిరితోనే ఉదయించినది
ఓంకార శ్రుతి.

ఊయలలోని పాప చూపులు
ఉరికెను నరహరివైపు
చిత్తములోనే చిత్తరువాయెను
శేషాద్రీశుని రూపు.

కడుపులోన ఉన్నపుడే
కావ్యపానము చేసినదా?
అమ్మఒడిలో ఒదిగినపుడే
బ్రహ్మజ్ఞానము పడసినదా?

ఆయువు పోసుకున్ననాడే
అష్టాక్షరి నేర్చినదా? హరి
ప్రసాదమై జన్మించిన వారికి
అసాధ్యమొకటున్నదా?

## ఏల? ఆ బాల

ఏల? ఆ బాల నిలు - వెల్ల పులకించెను?
ఆడే ఈడులోనే నర - హరినే స్మరియించెను?

బడికి పొమ్మంటే - గుడికి వెళుతుంది
ఆడుకొమ్మంటే - పాడుకుంటుంది
సింగారించుకొమ్మంటే - మంగాపతిని కైచేస్తుంది
పూలు పెట్టుకోమంటే - పూజ చేస్తుంది.

ఇంటిపనులు చేయమంటే - ఇచ్ఛగించదు
వెంటనున్న చెలులతోనే - జంట కట్టదు
ఒంటరిగా ఉండాలని ఊహించేను
మాటలాడకుండ - మౌనంగా నిలిచేను.

బాల్యదశలోనే - భావం - భగవదర్పితము
చిరుత ప్రాయమందే - చిత్తం శ్రీనివాసాంకితము
ఏమి చేస్తున్నా ఆ - ఎదలో వేంకటేశుడే
ఎటు చూస్తున్నా - ఎల్లెడల శ్రీనరసింహుడే.

## వెంగమాంబ జీవితం

వెంగమాంబ జీవితం – వేంకటేశాంకితం – ఆ
భక్తశిఖామణి చరితం – పరమపునీతం.

అష్టవర్షప్రాయములో – అదే దైవ చింతన
పవలురేయి చేసేను – భగవత్ స్మరణ
తల్లిదండ్రుల కేమో – తరగని ఆవేదన
కన్నకూతురును గూర్చి – అన్నివేళల యోచన.

తత్త్వవేత్తవలె తోచె – తనయను జూచి,
ఏమిసేయవలెనో – ఎరుగక వగచి,
కృష్ణయ్య దంపతు లాక్రోశించిరి
ఆమె బ్రతుకు చక్కసేయ ఆలోచించిరి

పరిణయ మొనరించుటే – పరిష్కార మార్గమని,
వయసురాక ముందే ఈ – పనిని చేయతగునని,
నిర్ణయించుకొని పెద్దలు – నిలదీసి అడుగగా – తనకు
వివాహమైనదని పలుక – విని నివ్వెరపోయిరి నిరుత్తరులైరి.

## వేంకటాచలాధిపతి

వేంకటాచలాధిపతి – వెంగమాంబకు గతి
జీవన వీణాశ్రుతి – చిదానందాకృతి.

లోకసంబంధములకు – లోబడని సదాత్ములకు,
పారమార్థిక పథమున – పయనించు కృతార్థులకు,
భౌతికాపేక్ష రహిత – భవపాశ విదారులకు,
పరమాత్ముడే పతి, శ్రీ – చరణాలకు శరణాగతి.

మనసుకు నచ్చనట్టి – పనులు చేయలేక,
తన కిష్టము లేనట్టి – దారి నడువలేక,
మహిత తత్త్వమార్గములో – మనుగడ సాగించే
జీవులకు భక్తియే – త్రోవజూపు జ్యోతి.



## కన్నెప్రాయము రాకమునుపే

కన్నెప్రాయము రాకమునుపే – కల్యాణమా?
వయసు కన్ను తెరువకముందే – పరిణయమా?

వద్దని చెప్పిన – పెద్దలు వినరు
మనసు తెలిసి – మసలుకోరు
తత్త్వము గూర్చి – తలంచరు
మహిత భక్తిని – గ్రహించరు.

జరుగబోయేది ఎరిగినా – తల్లి
దండ్రుల మాటకు – తలవంచినది
పరిణామములను – గురుతించినా
కాలానుగుణముగ – కదలినది.

ఇంజేటి వేంకటాచలపతికి
ఇచ్చి చేసిరి పెళ్లి
ఎంతగా వారించినా
ఎవరు చెవిని పెట్టరైరి.

## విధి విలాసములు

విధివిలాసములు విదితము కావు
ఎంతవారికైనా, వే – దాంత విదులకైనా.

కన్నెప్రాయమున – కాలిడలేదు
యుక్తవయస్సున – ఉరుకగలేదు
వెంగమాంబకు – వివాహమా?
బాల్యములోనే – పరిణయమా?

భక్తి తప్ప – బాహ్యమెరుగదు
ప్రాపంచిక విషయ ప్రసక్తి తెలియదు
తెలియు నొక్కడే – తిరుమలాధిపతి
అన్నివేళల – అతడే సద్గతి.

పారాణి పదముల – ఆరక ముందే,
పచ్చని తోరణము వాడక ముందే,
నొసటి వ్రాతయే – పసిమి వీడినది
విగతభర్తృకగ – మిగిలిపోయినది.

## నారీ జనాభ్యుదయమునకు

నారీ జనాభ్యుదయమునకు
నాందీగీతం వెంగమాంబ
సాంఘిక దురాచార సంస్కర్తగ
సంభవించెను వెంగమాంబ.

ప్రశ్నించే అధికారం - ప్రతియొకరి జన్మహక్కు
ఆధునిక భావ పరంపరకిదే - ఆదిబుక్కు
గంగిరెద్దులా తలాడించక - గానుగెద్దులా తలాయించక
అన్యాయము లెదిరించి ఆబల పో - రాడవలెనని ఈమె వాక్కు.

పతిని కోలుపోయినంతలో - పసుపు కుంకుమలు తీయాలా?
శిరోముండనం చేయించుకొని - శ్వేత వస్త్రమే కట్టాలా?
గాజులు జాజులు విడిచివేసి - కఠిన శిలవోలె బ్రతకాలా?
ఛాందసవాదనతో మహిళలు - అంధకారమున మునగాలా?

గొర్రె దాటు ఆచారాలపై - గొడ్డలి పెట్టు
తరతరాల మూఢవిశ్వాసముపై - తిరుగుబాటు
మనకేమని ఊరకుంటే - మానవతకే చేటు
ధీరతతోన తెగించిన నాడే - తీరుతుంది లోటు.

## ఎవరేమన్నా

ఎవరేమన్నా, ఈసడించినా,
లేశమైనను - లెక్కసేయదు
భక్తియే గమ్యమని - భావించు వెంగమ
పరుల మాటలను - పట్టించుకోదు.

భగవానుడే తనకు - భర్తయన్నది
సప్తాచలేశుడే - సర్వమన్నది
సంకల్ప శుద్ధితో - సత్యసిద్ధితో
కృతనిశ్చయమున - బ్రతికినది.

బొట్టు కాటుకలు - పుట్టుకతో వచ్చెనని
పతి గతియించిన - వదలుట యేలని?
ముత్తయిదువుగా - ముందుకేగినది
దురాచారముల - నిరసించినది.

ఈ అసమానత లెందుకని?
స్త్రీ జాతికి ఈ - శిక్ష యేలని?
ప్రత్యుత్తరింపుమని - ప్రశ్నించినది
పరమఛాందసుల - ప్రతిఘటించినది.

## అందెలు ఘల్లన ఆడినది

అందెలు ఘల్లన – ఆడినది
డెందము పొంగగ – పాడినది
వెంగమాంబయే – వేడినది
కొండల రాయని – కొనియాడినది.

ఎవరేమన్నా ఏమనదు
పరిసరముల గురుతించదు
వెర్రిదన్ననూ – వెక్కిరించినను
ఒక్కమాటనక – ఊరకుండును.
అందెలు ఘల్లన – ఆడినది

పరవశమున శ్రీపతినే కొలిచి,
తాదాత్మ్యములో – తన్మయించి,
ఆత్మారామత ననుభవించి,
ఉన్మత్త భక్తి – ఉన్మేషించి,
అందెలు ఘల్లన – ఆడినది

దేహభ్రాంతిని – తెగత్రెంచి
మోహపాశముల – మూలము త్రుంచి
సర్వం విష్ణుమయమ్మని యెంచి
సదానందమున జగమే మరచి
అందెలు ఘల్లన – ఆడినది

## ఎదురీదే ప్రతివారికి

ఎదురీదే ప్రతివారికి - ఎన్నో అవమానములు?
నిలదీసి న్యాయమడిగితే - నిందారోపణలు
మార్పుకొరకు యత్నిస్తే - మథనం తప్పదు
సమాజమును ప్రశ్నిస్తే - సమాధానముండదు
వెంగమాంబకైనా - వేరెవరికైనా
ఏ కాలమైనా - ఏ వేళనైనా

పసుపు కుంకుమలు తీయలేదని -
పరిపరి విధముల విమర్శించినా,
యథావిధిగా నరసింహార్చనలో - ఆనందించెను
సమాజ పరిస్థితిని తాను - సహించలేక కృష్ణయ్య,
సుబ్రహ్మణ్యయోగి చెంతకు - సుతను తోడ్కొనిపోయెను
పుత్తడిగా రూపొందాలంటే - పుటమున కాగాలి
రత్నముగా రాణించాలంటే - రాపిడి కావాలి
మానవ జీవన ప్రస్థానము - మహోజ్జ్వలముగా వెలగాలంటే,
మార్గనిర్దేశ మొనరించే - మంచి గురువే ఉండాలి.

సద్గురు దేవుని - సమాశ్రయమున
మంత్రోపదేశ - మహిత సిద్ధితో
పూర్ణత్వమంది - పునీతయై
విజ్ఞాన వివేక - విరాజితయైనది.

వెంగమాంబ - భక్తిభావనాలంబ

## అక్షర సాక్షాత్కారం

అక్షర సాక్షాత్కారం ప్రత్యక్ష శారదా కటాక్షప్రసారం
నభోవీథిలో వర్ణమాలికలు
నక్షత్రాలుగ తళుకుమన్నవి. ఆ
తారా పంక్తులు అక్షతలై,
తరుణి శిరముపై కురిసినవి.

స్వరములే విరిసరములై,
హల్లులే హరివిల్లులై,
కనులకు కనబడి మోమున చొరబడి
తనువునే అల్లుకున్నవి.

మధ్యందిన మార్తాండ సహస్ర
మయూఖావళి వోలె,
మస్తిష్కములో ప్రజ్ఞాన ప్రభా
మహోన్నత విద్య వికసించె
ప్రణవపూర్వక మంత్రగాయత్రి
మనసునే ప్రచోదించె
సహస్రార సరసీరుహమ్ములో
జ్ఞాన చంద్రికలు స్రవించె.

## గురూపదేశముతో

గురూపదేశముతో, సరస్వతీ సాక్షాత్కారముతో,
తరియించి తిరిగివచ్చినది – తరిగొండకు వెంగమాంబ.

నిరంతరం ఉపాసన – నిరతం యోగసాధన
నరసింహస్వామి ఆలయములో – జరిగెను కవిత్వరచన
హనుమ విగ్రహము వెనుక – అనుపమాన ధ్యానభావన
లోకము మరచి ఏకాంతములో – వేంకటేశార్చన.

శ్రీకారము చుట్టె నర – సింహశతకము
ద్విపద కవితలకు – దిద్దెను తిలకము
యక్షగానముల – అవతరణం
తాత్త్వికరచనకు – తార్కాణం.



## గొప్పవారి కెపుడైనా

గొప్పవారి కెపుడైనా
తప్పదులే పరీక్ష
ఆదర్శ జీవులకు
అదియే శ్రీరామరక్ష.

కావ్యరచనలో మునిగిన
కవయిత్రికి శోధనలు
అడుగడుగున అవరోధములు
సుమంగళిగ ఉన్నదని
చూడలేక కువిమర్శలు
పీఠాధిపతిని అటకు
పిలిపించిరి ఛాందసులు.

పుష్పగిరి స్వామికి - పుణ్య చరిత్రునికి
వెంగమాంబ చర్యలను - వివరించిరి వారు
కట్టుబాట్లకు లోబడి - బొట్టును, జుట్టును తీయ
ఆనతీయుమని స్వామిని - అభ్యర్థించినారు.

ఆచార్యదేవుని - ఆజ్ఞానుసారము
అరుదెంచినది - వెంగమాంబ

వలువ చాటున చేరి – వాదనలు వినిపించి
వేంకటేశుడు తనకు – విభుడనుచు పలికె.

శంకరాచార్యునికి – సద్భక్తి తోడ
చేమోడ్పు చేయుమని – శిష్యులడుగ
ఆసనము వీడితే – అపుడంజలింతునని
మహిత యోగినియే – మనవిసేయ

స్వామి అటులేచె! భామకైమోడ్చె
ఆసనము అగ్నికి ఆహుతాయె
వెంగమాంబా భవ్య – విభవమ్ము గ్రహియించి
శంకరాచార్యులే – సన్నుతించె
ప్రహ్లాద రూపమని – ప్రస్తుతించె!



## తరిగొండ నికేతనుడు

తరిగొండ నికేతనుడు – తరుణికి ఇలువేల్పు
గరుడాద్రినివాసుడు – కలికి ఎడద తాల్పు

మౌనములో తాదాత్మ్య – గానములో,
యోగములో చిదానంద – భోగములో,
తలమునుకలుగా – తడిసిపోయినది
కావ్యరచనలో – కాలము గడిపినది.

దివానిశలు తిరుమలపతి – దివ్యధ్యానములో,
శివకేశవాద్వైత – చింతనామృతములో,
తేలియాడుచు వెంగమ – దేహమునే మరచినది
గుడిలో తపమొనరించుచు – కూర్చుని యుండేది.

పూజారి ఒకనాడు – పూజచేయగ వచ్చి
వీరాంజనేయుని – వెనుకనున్న
వెంగమాంబను చూచి – వీరావేశముతోన
జుట్టుపట్టి బైట కీడ్చివేయగా

ఆ కనుల నుండి యో – గాగ్ని జ్వాల
ప్రళయకాలాభీల – ప్రభవన్మహాకీల
అర్చకుని నలువైపు – లాక్రమించె అతడు
ఆ తల్లి పదయుగము – నాశ్రయించె.

## పాడులోకము

పాడులోకము తీరు చూచి
పరిస్థితులకు తాను రోసి
మారలేని జనుల నడుమ
మనగలేనని మదిని యెంచి
వెంగమాంబ కోరుకున్నది
వేంకటేశుని సన్నిధి.

దేవతార్చన చేసి తాను
దివ్యభావన పొంది మేను
తల్లితండ్రులకైన చెప్పక
తరలిపోయినది తరి
గొండ గ్రామము విడిచి - ఏడు
కొండలను చేరంగ నెంచి
భయము గొలిపే అడవి బాటను
బయలుదేరినది.

గమనశ్రమను లెక్కచేయక
గమ్యమొకటే లక్ష్యమనుచు
పరమభాగవతోత్తమ
ప్రయాణించినది
మార్గమధ్యమునందున
మారుతిని మనసార కొలిచి
పన్నగాద్రిని చేరుకోగా
పయనమైనది.

## అగుపించే నదివో

అగుపించే నదివో - ఆనందనిలయం
సప్తాచల నిలయుని - సౌభాగ్యవలయం
కనుగొన్నవారికి - కైవల్య శిఖరం
తిరువేంకటేశుని - దివ్యనగరం.

వెంగమాంబిక ముందు - వేయి వెలుగుల మేడ
వేదాల కదియే - వెన్నెల గొడుగు నీడ
పరమాత్మస్థానమౌ - పసిడివాడ
ఇదియే వైకుంఠము మది - నెంచి చూడ

ఓంకార రూపుని - శ్రీకరప్రాకారం
స్వయంప్రకాశితమైన - స్వర్ణగోపురం
సముదంచిత పుష్కరిణి - సరోవరం
సకలపాపహరం - సకలతీర్థసారం.

దేదీప్యమానమౌ - దివ్యదర్శనం
నిజదాస బృందమునకు - నిత్యశోభనం
తిలకించిన క్షణములో - నిలువెల్ల నివేదనం
మనసులోన వెలిగేను - మంగళ నీరాజనం.

## వేంకటేశుని - వివశతతోడ

వేంకటేశుని - వివశతతోడ
వెంగమాంబయే - వినుతించెను
పన్నగాద్రిపై - వసియించుటకు
అనుమతించుమని - అర్థించెను.

అలమేల్మంగ - ఆనతిలేక
కొండపై నెవరు - ఉండలేరని
స్వప్నములోన - సాక్షాత్కరించి
దేవదేవుడే - తెలియజేసెను.

తిరుమలపైన - తిరముగ నుండగ
సమ్మతింపుమని - అమ్మను వేడి
అనుజ్ఞ పొంది - ఆనందించి
గిరిపై నెలకొని - మురిసిపోయెను.

సప్తగిరీశుని - సంకల్పముచే
అచ్చట మహంతు - ఆశ్రయమీయగ
శ్రీనివాసుని - సేవలు జేయుచు
కవితారచనల - కాలము గడపెను.

## తులసీదళముల

తులసీదళముల – కలియుగ వరదుని
కొలువగ వలెనని – తలపోసి,
అందుకు అనువుగ – సుందర బృందా
వనమును పెంచగ – మనసున తలచె.

పూల మాలికల – పురుషోత్తమునికి
అలంకరించగ – ఆశించి
తోటను తీర్చి – తోయజాక్షునికి
విరిసరములను – వేయగ వేచె.

బావిని త్రవ్వగ – బండరాయి పడ
గంగాదేవిని – కరుణింపుమనె!
జాహ్నవి దయతో – జలనిధి పొంగగ
మొక్కలు పెంచి – ముదమొందె.

నారతో కాదు – ప్రేమదార మా
ధారముగా – మందారదామములు
మనోహరాలుగ అల్లి, మనోజ్ఞ
హారాలను హరి ఉరమున వేసె.

## పవలురేయి పరమాత్ముని

పవలురేయి పరమాత్ముని
పరిచర్యల మునిగిపోయె
తన్మయానుభూతితో
తనువు మరచిపోయె.

ఒంటరిగా ఉన్నవేళ
ఊహలు రెక్కలు తొడిగి
భావ విహాయస పథమున
పయనించగ సాగె.

విష్ణుపారిజాతముతో
వేంకటేశు నర్చించె
యక్షగానముల రచించి
అక్షరానుభూతి పొందె.

సుందర ఛందములతో రస
బంధురముగ కృతుల గూర్చె
అందమైన తాత్త్విక - మక
రందము చిందగజేసె.

అన్నమార్యునికి మదిలో
అంజలించె
ఆశుకవిత లెన్నెన్నో
ఆలపించె.

## ఏడుకొండల పైన

ఏడుకొండల పైన చేరినా
ఇంతికి వేదనలే
స్వార్థపరులచే సాధుజనులకు
సతతము శోధనలే.

అర్చకస్వాములైన - అక్కారాందీక్షితులకు
వెంగమాంబ పూజలు చేయుట - వెక్కసమైపోయింది
పొంచి ఇంటి ప్రక్కనుండి - పులివిస్తరాకులను
విందారగించిన పిదప - విసరివేయుట జరిగేది.

ఒకనాడు యోగమున - నున్న సమయములోన
ఎంగిలాకులు పడెను - వెంగమాంబికపైన
ఆ క్షణములో నామె - నావహించెను స్వామి
ఆగ్రహావేశముల - అదరిపోయెను భూమి.

కోపాగ్నిజ్వాలికల - కురిసినది కనుజంట
శాపప్రకారమే - సాగినది వెనువెంట
వంశక్షయమగునని - శాసించెను
వీరనరసింహునిగ - వెలుగొందెను.

భక్తులవమానమును - పరమాత్మ సైచడు
ఘోరాపరాధముగ - గురుతించును
అందుకే ఆనాడు - అతివనాల్కను నిలచి,
అపరావతారమున - శపియించెను.

పరమ యోగిని యని - గురుతించి, శరణమని
పరితప్త హృదయుడై - చరణాల వ్రాలగా
అక్కారామయ కిక - ఏక సంతానమని
శాపోపశమనముగ - సవరించెను.



## అతడే చెంతకు

అతడే చెంతకు – అరుదెంచవలెగాని
గుడిచేరి తానేల – కొలువగవలెనని
దేవాలయములోన – దినమంతయుండి
అర్చించ నచ్చదు – అర్చకులకని
భావించెను. ఎంచెను. తాను నివసించు
తావే సన్నిధిగా – సేవించెను.

వెంగమ్మ అల్లిన – విరిమాల దాల్చక
వేళ గడువదు – వేంకటేశునికి
భక్తురా లర్పించు – పసిడి హారతి లేక
ప్రొద్దుపోదుగా – పురుషోత్తమునికి
ఆమె రాలేదనుచు – అర్ధరాతిరివేళ
తిరుమలాధీసుడే – తరలి వచ్చెను.

దేవాదిదేవుడు – దిగివచ్చి ఆమెతో
ఆటపాటలందు – ఆదమరచె
ఆ తల్లి కవితల – నాలపించగ విని
సుప్రభాతము వరకు – సోలిపోయె
శరణార్థుల కొరకు – పరమాత్ముడే వచ్చి
సామాన్యుడైపోయి – సంచరించె.

## మనసర్పించిన

మనసర్పించిన - దాసుల జూచిన
మహదానందము దేవునికి - ఆ
ప్రేమసుధారసపానము చేసిన
స్వామియె మరచును - తన ఉనికి.

పరబ్రహ్మయే - పసిబాలుని వలె
వెంగమాంబను - వెంటాడును - తల్లి
కొంగుచాటున దాగు - కొమరుని వోలె
అల్లరి చేసి - ఆటాడును
పరమాత్ముడన్నది మరచిపోవును.

తల్లిగ లాలించు - తనివిదీర
పాట లాలపించు - భక్తిమీర
ఆటలాడే వేళ - అనురాగధార
పూజచేసేటపుడు - పూలమాల
వెంగమాంబ - వేదాంతగంగ - శ్రీ వేంకటేశాంతరంగ.

## ఎంతటి కరుణ

ఎంతటి కరుణ వేంకటేశునికి – ఈ దాసుల పైన!
వేడినవారు వేదన పొందిన – చూడలేడు క్షణమైన.

బారులుతీరిన భక్తుల నడుమ
        బ్రహ్మోత్సవ వేళలోన
తిరుమాడవీథుల తేరుసాగెను
        వెంగమాంబ ఇంటిముంగిట ఆగెను
ఆచార్యవర్యులు ఆశ్రితజనులు
        యత్నించినా గాని అరదము కదలదు
ఈ రీతి జరుగగ కారణమేమని
        ఎవ్వరికి తెలియదు.

కదలలేదు రథము – కప్పూర హారతి లేక
వెడలలేదు ప్రభువు – వెంగమ్మ రాక
శరణాగతుల శక్తి – నిరూపించగా
స్యందనమాగెను – ముందుకు పోక.

శరణన్నవారిని సంరక్షించి
        సగౌరవముగా సత్కరించగా,
శ్రీనివాసుడు సేయు చిద్విలాసమిది
        ప్రపన్నులపైన పరమప్రేమ ఇది
ఇంతలో వెంగమ ఏతెంచెను
        ఏడుకొండలవాని కీర్తించెను
సారసాక్షుని సన్నిధి నిలిచి
        హారతి నీయగ తేరు తరలెను.

## పగలంత స్వామికి

పగలంత స్వామికి - పరిచర్య చేసి,
ఏకాంత వేళలో - శ్రీ కాంతు కొలిచి,
మిగిలిన సమయములోన - మేటి కృతులను వ్రాసి,
పరవశించి పోయేది - భక్తి భావనారాశి.

యథావిధిగ పరాత్పరుడు
అరుదెంచెను ఆ రేయి
పరస్పరము వినోదముల
పడసిరి హాయి
తెల్లవారబోతుందని
తెలిసి స్వామి అరిగె
పడతి చేతనున్న విభుని
పట్టువలువ చిరిగె.

సుప్రభాతవేళలో - అప్రమేయుని గుడి
తలుపులు తెరచిన వారు - తెలవోయిరి
మూలమూర్తిపై నున్న - చేలాంచలము
చిరిగియుండుట చూచి - చేష్ట లుడిగిరి.

శేషవస్త్రమేదని - చింతించిన అర్చకులు,
నారీమణి గృహమునకు - చేరిపోయిరి
ఇదిగో పీతాంబరమని - ఇంతి చూపగా
వెంగమాంబ నందరూ - వినుతించిరి.

## ఏకాంతమే కదా

ఏకాంతమే కదా - ఇష్టము యోగులకు
భక్తులు దూరము - ప్రచారములకు

ఒంటరిగా నుండి - ఉపాసనములో
ఒడలు మరచుటే - ఉత్తమము
జన సంఘములోన - మనసుకు దొరుకదు
అనుపమాన బ్రహ్మానందము.

అలఘు భాగవతము - తెలుగున వ్రాయగ
తలచి ప్రభునికి - తెలియజేసెను
ప్రశాంతమైన ప్రదేశమ్ములో
రచన చేయగా - రమణి తలచెను.

తుంబురుకోనకు - తొరగా చేరగ
మదిలో నెంచి - మనవి జేసెను
యోగశక్తితో - యోజన దూరము
త్రుటిలో దాటి - అటకుజేరెను.

## ఏ అలజడి లేదు

ఏ అలజడి లేదు - ఎవ్వరు రారు
ఎదలోని అనుభూతి చెదరిపోదు
తుంబురుకోనలో - అంబరమంటిన
ఆనందానికి - అవధులు లేవు.

ఎటుచూచినా - వేంకటేశుడే - ఆ
శ్రీనివాసునిలో నరసింహుడే
ప్రకృతి సర్వము - పరమ పురుషుడే - ప్రతి
ఆకృతిలో తోచె - ఆద్యంతరహితుడే.

అదృశ్యరూపమున - అర్ధరాత్రిలో
కొండకు చేరి - కొలుచుచుండెను
ఏ వేళ వెంగమ్మ - ఏ తెంచకున్నా
శ్రీనివాసుడే - చెంతజేరును.

మౌనమే కదా మంత్రము
ధ్యానమే యోగ తంత్రము
కోరె వెంగమాంబ - కుండలినీ సాధన
ఆమె భావన - అద్వైతాత్మావలోకన.

## వెంగమాంబ జాడ నెరుగరు

వెంగమాంబ జాడ నెరుగరు – వేంకటాద్రి పౌరులు – ఆ
తల్లియెచ్చట కేగెనోయని – తల్లడిల్లిరి భక్తులు
రాత్రివేళల తిరుమలేశుని – రహస్యముగా కొలుచు నెవరని
ఊహ కందక సంశయించిరి – ఊరి ప్రజలు.

చంద్రశేఖరుడనెడు విప్రుడు – చర్మరోగగ్రస్తుడు
భయదజాడ్య వికార బాధల – బ్రతుకు పైనే రోసినాడు
తిరిగి తిరిగొకనాడు – తుంబురు – తీర్థము సమీపించినాడు
అచట తపమొనరించుచున్న – అమ్మనే దర్శించినాడు.

వ్యాధి నుండి విముక్తి నిడుమని – పాదములబడి వేడగా,
అతని వేదన గాంచి మనసున – ఆర్ద్రతే ఉప్పొంగగా,
పుష్కరిణిలో మునిగినంత – పుణ్యదేహము దాల్తువనెను
విషయమెవరికి చెప్పినా – విగతజీవుడవగుదు వనెను.

తిరుమలను నడయాడు నూతన – పురుషు డెవరని ఎరుగక,
పుష్కరిణీజుడనుచు పిలిచిరి – పూర్వరూపము తెలియక
విప్రవీగుచు నొక్కనాడు – వెంగమాంబ వివరము పలికెను
క్షణములో ప్రాణముల బాసెను – జనము లామెను చూడతరలెను.

## తిరిగివచ్చె వెంగమాంబ

తిరిగివచ్చె వెంగమాంబ – తిరుమలకు
పరమ సంతోషమాయె – భక్తులకు
ప్రజలరాకతో – ప్రశాంతత కొరవడి
ఇన్నాళ్ళ ఏకాంతము – ఇంతటితో వీడి.

శ్రీనివాసుని చెంతకు – చేరే ఆశ్రిత కోటి
వెంగమాంబ విడిదికి – విచ్చేయుట పరిపాటి
ఆదరించుటలోన – ఆమె కెవరు సాటి
కొండమీద భక్తులతో – నిండెను ఆశ్రమవాటి.

వేంకటాచల మాహాత్మ్యమునే వ్రాసి,
యక్షగానములకు – అక్షరాకృతి కల్పించి,
దివ్యకీర్తనలు, – ద్విపద కావ్యములు,
తాత్త్విక రచనలు చేసి – ధన్యత గాంచె.

జరిపేది ప్రతియేట – నరసింహజయంతి
భగవానుని కోరేది – భవనిష్కృతి
సమయము దొరికితే – సంతరించు రసవత్కృతి
అష్టఘంటములచేత – అమరించెను శుద్ధప్రతి.

## ముముక్షుజనులకు

ముముక్షు జనులకు – నివృత్తి మార్గమే సమస్తము
ప్రశాంత జీవన విధానమే కద – ప్రశస్తము
తపస్వు లెన్నడు ప్రచారములకై – తపించరు
వరేణ్యు లెపుడు పరాత్పరుని మది – భజింతురు.

ఎందరెందరో వెంగమ కడకు – ఏతెంచి కొలిచినా,
పురాధీశులు, పుణ్య చరితులు – భూరిదానము లొసగినా,
ఇది యంతయు తన గొప్పదనమని – ఎన్నడు తలచలేదు
విత్తమునంతయు ఉత్సవములకే – వినియోగించెను.

తరిగొండను జనియించి – తిరుమలపై జీవించి
వేంకటేశ్వరు నర్చించి – వేయిచంద్రులను దర్శించి
విరాణ్మూర్తిలో విలీనమొందగ – వేచెను విరాగిణి
వికుంఠగమనాభిలాషతో – వేడెను మనస్విని.

సహోదరీ కుమారిని – సమాదరించినది
నివాళినే ఇక నివేదించగా – నియోగించినది
జితేంద్రియత్వము సాధించినది – చిన్మయస్వరూపిణి
క్రాంతదర్శనము పొందినది త్రి – కాలవేదిని.

## ఈ జన్మ కిది చాలదా!

ఈ జన్మ కిది చాలదా! వేంకటేశా!
ఇక నేమి వలదు సదా చిత్రప్రకాశా!

ఆనతి నీయుమని - అనుమతి నొసగుమని
సజీవముగ నిర్వికల్ప సమాధి - సంప్రాప్తించగ సేయుమని

వెంగమాంబ వేడుకోలు
వేంకటేశునికి విన్నపాలు

బ్రతుకు భారమున - బడలి పోతినని,
ముదుసలితన మిక - మోయలేనని,
ఆత్మరూపమున - అర్చించవలెనని,
కైవల్యపథము - కాంక్షించేనని,

వెంగమాంబ వేడుకోలు
వేంకటేశునికి విన్నపాలు

ఏకాంత సేవానంతరము
లోకైకపతికి మంగళ హారతి
ఇదే విధముగ కొనసాగెవలెనని
అదే తన పేర సార్థకమగునని

వెంగమాంబ వేడుకోలు

వేంకటేశునికి విన్నపాలు

బ్రహ్మజ్ఞానము - పడసిన యోగిని
తత్త్వము నెరిగిన తపస్విని ఆత్మ
సాక్షాత్కృతికై - సాధనచేసిన
మోక్షపథగామిని.



## శ్రీ పన్నగాద్రివర శిఖరాగ్రవాసునకు

"శ్రీ పన్నగాద్రి వర శిఖరాగ్ర వాసునకు
పాపాంధకార ఘన భాస్కరునకు
ఆ – పరాత్మునకు నిత్యానపాయిని యైన
మా పాలి అలమేలు మంగమ్మకు"

ముత్యాల హారతిచ్చె వెంగమాంబ
నిత్యాత్మయౌచు నిలిచె.

ఏకాగ్ర చిత్తమున – వేంకటేశుని కొలిచి
దేహ మోహములను – తెగత్రెంచి
సాహిత్యమంతయూ – సమర్పణము చేసి
అంతరంగము – చర–ణాంకితమ్మొనరించి

ముత్యాల హారతిచ్చె
నిత్యాత్మయౌచు నిలిచె.

అర్చకులు ఆశ్రితులు – ఆస్థాన పండితులు
పురజనులు యోగులు – భూమి పాలకులు
తిలకించగా నవమి – దివసమ్మునందు
వేదమంత్రములే – వినిపించగా ముందు

దేవాలయ సమీప - దివ్యస్థలము నందు
సశరీరముగ వర - సమాధియందు

వెంగమాంబిక ప్రవేశించెను
విరివాన లామెపై - వెల్లువై కురిసెను

కుండలిని యోగమున - కూర్చున్న ఆ తల్లి
షట్చక్రముల దాటి - సహస్రారము మీటి
దేహము సమాధిలో - దివ్యత్వమందగా
ఆత్మరూపములోన - అచ్యుతుని కొలిచెను
వేంకటేశ్వరునికి - విశ్వతోముఖునికి
నీరాజనముగ వెలిగి - నిత్యత్వమొందెను.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

